సాక్షి
విశాఖపట్నం

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



ఆశలు చిగురిస్తున్నాయి

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భారీ వృక్షాల సంరక్షణకు అధికారులు చూపిన చొరవ సత్ఫలితాలనిస్తోంది. 8లో



జోరుగా పింఛన్ల పంపిణీ

జిల్లాలో పింఛన్ల పంపిణీ మంగళవారం చురుగ్గా సాగింది. పింఛనుదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 8లో



చందనోత్సవానికి ఏర్పాట్లు

సింహగిరిపై ఈ నెల 23న జరిగే చందనస్వామి ఉత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి కొట్టు తెలిపారు. 10లో



అయ్యన్న అలక!

- గంటాకు ప్రాధాన్యమివ్వడంపై కినుక
- చంద్రబాబు సమావేశానికి వచ్చేది లేదని స్పష్టీకరణ
- అయ్యన్నను బుజ్జగిస్తున్న టీడీపీ సీనియర్లు
- తన నియోజకవర్గంలో గంటా జోక్యంపై అనిత మండిపాటు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడు అలకబూనారు. పార్టీని అంటిపెట్టుకున్న తమని కాదని.. ఇన్ని రోజులూ పార్టీకి దూరంగా ఉన్న గంటా శ్రీనివాసరావుకు ప్రాధాన్యమివ్వడంపై రగిలిపోతున్నారు. పార్టీలో తన పాత్రపై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన విశాఖలోని వి-కన్వెన్షన్‌లో నిర్వహించే పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి రానని తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో అయ్యన్నను ఆ పార్టీ సీనియర్ నేతలు కొందరు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు భోగట్టా. పార్టీలో తనకు ప్రాధాన్యతతోపాటు ఎమ్మెల్యే టికెట్, తన కొడుకుకు ఎంపీ సీటు ఇస్తామన్న స్పష్టమైన హామీ కోసం అయ్యన్న పట్టుబడుతున్నట్లు సమాచారం. మరో వైపు పాయకరావుపేట నియోజకవర్గంలోనూ గంటా జోక్యం చేసుకుంటూ తనకు టికెట్ రాకుండా చేస్తున్నారంటూ అనిత కూడా మండిపడుతున్నారు. బుధవారం సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, ఎమ్మెల్యే వెలగపూడి హాజరుకావడంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



అధిష్టానం తీరుపై అసంతృప్తి

ఇన్ని రోజులుగా పార్టీకి దూరంగా ఉండి.. ఇప్పుడు ఎన్నికలకు ముందు హడావుడి చేస్తున్న నేతలతో జాగ్రత్తగా ఉండాలంటూ గతంలో విశాఖలో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలోనే అయ్యన్నపాత్రుడు కుండబద్దలు కొట్టినట్టు హెచ్చరించారు. ఎవరండీ గంటా.? లక్షల్లో ఒకరు.. ఆయన ఏమైనా పెద్ద నాయకుడా.? అని ప్రశ్నించారు. ఇన్ని రోజులుగా ఇంట్లో నక్కుకుని.. ఇప్పుడు బయటకు వస్తున్నారని.. వారితో జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ అధిష్టానం గంటాకే తాజాగా మద్దతు తెలపడం అయ్యన్నకు రుచించడం లేదు. తాజాగా జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అంతా తానే నడిపించినట్టుగా గంటా వ్యవహరించడంతో పాటు ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి కూడా హాజరయ్యారు. ఈ వ్యవహారాలకు అయ్యన్న దూరంగా ఉన్నారు. తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ అడుగుతుంటే... వేరే వ్యక్తిని గంటా ప్రతిపాదిస్తున్నారని అయ్యన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడోపేడో తేల్చుకునేందుకు అయ్యన్న సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

గంటా జోక్యంపై ఆగ్రహం

నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో ఇటీవల జరిగిన స్థానిక పండగకు గంటాను రుత్తల యర్రాపాత్రుడు ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, మాజీ మంత్రి బండారు సత్యనారాయణను పిలిచారు. అయితే ఈ సమావేశానికి అయ్యన్న వ్యతిరేకులైన ముత్యాలపాప, బండారు హాజరయ్యారు. ఈ వ్యవహారం వెనుక కూడా గంటానే ఉన్నారనే అనుమానాలను అయ్యన్న వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పాయకరావుపేట నియోజకవర్గంలో కూడా గంటా జోక్యం చేసుకుంటున్నారంటూ అనిత ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో తనకు వ్యతిరేకంగా సమావేశమైన నేతలను పార్టీ నుంచి అనిత సస్పెండ్ చేయించారు. ఈ వ్యవహారంపై బహిష్కరణకు గురైన నేతలు అనిత తీరుపై మండిపడుతున్నారు. కాపు నేతలను అనిత సహించడం లేదని, గతంలో కాపు నేతలపై చెప్పుతో దాడి చేయించారని విమర్శిస్తున్నారు. దీనిపై టీడీపీ సమాధానం చెప్పకపోతే ఆ పార్టీ తీరును ఎండగడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. విశాఖలో జరిగే సమావేశానికి అయ్యన్నతో పాటు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి కూడా దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. వెలగపూడి మాత్రం తన తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విజయవాడలో ఉన్నాననే సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. విశాఖలో బుధవారం జరిగే చంద్రబాబు సమావేశానికి ముందే పార్టీలో అంతర్గత కలహాలు రచ్చకెక్కడం చర్చకు దారి తీసింది.

ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు





జన జాతర

పోలమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఏయూక్యాంపస్: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో పెదవాల్తేరులో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. మహిషాసుర మర్దిని, పులివేషాలతో విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం, ప్రసాదం అందించారు. అమ్మవారి చిత్ర పటాన్ని బహూకరించారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు. జాతర నేపథ్యంలో ఆలయంతో పాటు 14 గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.



మంత్రికి అమ్మవారి చిత్రపటం బహూకరణ



అలరిస్తున్న విన్యాసాలు



న్యూస్‌రీల్

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో భక్తులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10వేలు చెల్లిస్తే.. వారి తరఫున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు, అకౌంట్ నెంబరు 06081001100 6691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో డబ్బులు చెల్లించవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, చిరునామా, ఫోన్ నెంబరును 8985515989 వాట్సాప్‌కు లేదా మెయిల్‌కు endowoekanaka@gov.in పంపవచ్చు.

స్థాయీ సంఘ సమావేశం రేపు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నారు. స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో 57 అంశాలు సభ్యుల ఆమోదానికి రానున్నాయని కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు.

14,15 తేదీల్లో క్రికెట్ శిక్షణ శిబిరానికి ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: అండర్-14 బాలుర క్రికెట్ వేసవి శిక్షణ శిబిరానికి ఎంపిక ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్నాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఎంపిక చేయనున్నారు. 2009 సెప్టెంబర్ 1న గాని తర్వాత గాని జన్మించిన వారు ఎంపికలో పాల్గొనేందుకు అర్హులు. ఈనెల 10,11వ తేదీల్లో స్టేడియంలోనూ, మున్సిపల్ స్టేడియంలోనూ ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రంతో పేర్లను నమోదు చేసుకోవాలి.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ ఇన్ఫోటెక్, డైకిన్ ప్రైవేటు లిమిటెడ్, హనీ గ్రూప్, హరికృష్ణ,(టాటా మోటార్స్) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 270 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ టీమ్ లీడర్స్, టెక్నీషియన్స్, సర్వీసు అడ్వైజర్లు, పెయింటర్స్, డెంటర్, టెలికాలర్స్, సర్వేయర్స్, మేనేజర్స్ ఉద్యోగాలకు ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమా పాసైన వారు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ.12,000 నుంచి రూ. 35,000 ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఆరోజు ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆడిట్

మహారాణిపేట: కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మంగళవారం సి.సెక్షన్ ఆడిట్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఇతర వైద్యులు గీతం, గాయత్రి విద్యా పరిషత్, అనిల్ నీరుకొండ, ఎన్ఆర్ఐ ఆస్పత్రుల్లో ఆడిట్ చేశారు. ఈ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సతో కూడిన ప్రసవాలు తగ్గించాలని ఆమె సూచించారు. ఆడిట్ రిపోర్ట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కేజీహెచ్ గైనకాలజిస్ట్ ఐ.వాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీశ్రీ, వుమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, గణాంక అధికారి మురళీకృష్ణ, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి వైభవాన్ని కీర్తిస్తున్న పండితులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం పండిత సదస్సు ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష అలంకరణ చేసి కల్యాణమండపంలో వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రధాన దేవస్థానాల నుంచి వచ్చిన వేద పండితులు తమ పాండిత్యంతో స్వామిని కీర్తించారు. స్వామి వైభవాన్ని వివరించారు. అనంతరం దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు పండితులను సత్కరించారు.

అదే విధంగా కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రతి గురువారం మాత్రమే లభించే స్వర్ణకవచ అలంకారాన్ని ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్సు రోజు కూడా చేయడం పరిపాటి. అలాగే ఉదయం 7 గంటల నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్యాన్ని నిర్వహించారు.

నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ అరెస్ట్

- వాచ్‌మన్ పోచన్నపై పోక్సో చట్టం కింద కేసు నమోదు, రిమాండ్

ఏయూక్యాంపస్/కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలోని నారాయణ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేసినట్లు దువ్వాడ ఎస్ఐ రూపవతి తెలిపారు. ఈ స్కూల్‌కు చెందిన వాచ్‌మన్ అలుగంటి పోచన్న 4వ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసును దిశ పోలీస్‌స్టేషన్‌కు బదలాయించడంతో దిశ ఏసీపీ వివేకానంద, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు మంగళవారం స్కూల్‌ను సందర్శించి.. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ ఘటనపై యాజమాన్యం నుంచి వివరాలు సేకరించారు. కాగా.. ఈ విద్యా సంస్థలో విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడం, ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం బాధ్యతారాహిత్యంగా పరిగణించి.. ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు అలుగంటి పోచన్నపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. నగరంలోని అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు తమ సంస్థల పరిధిలోని చిన్న పిల్లలు, విద్యార్థినులు, మహిళల రక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దిశ ఏసీపీ సి.హెచ్ వివేకానంద సూచించారు.



నారాయణ స్కూల్‌లో సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న దిశ ఏసీపీ వివేకానంద

వచ్చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్

- రేపటి నుంచి పూర్తిస్థాయి సేవలు
- మూడు పీహెచ్‌సీల ఎంపిక
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య ఆరోగ్య శాఖ

మహారాణిపేట: 'పెద్దాయన.. ఆరోగ్యం ఎలా ఉంది? సమయానికి మందులు వాడుతున్నావా? 'అని ఓ రోగికి డాక్టర్ పలకరింపు.. 'పెద్ద డాక్టర్ రాసిచ్చిన మందులతో పాటు పోయినసారి రాసిన బీపీ మందులు సమయానికి ఇస్తున్నారమ్మా.. నా ఆరోగ్యం బాగానే ఉంది.' తమ ఇంటికే వచ్చిన డాక్టర్‌కు రోగి సమాధానం. 'పల్స్ రేట్, బీపీ బాగానే ఉన్నాయి. ప్రస్తుతం వాడుతున్న మందులు అలానే కొనసాగించండి. ఏదైనా సమస్య వస్తే సిబ్బందిని సంప్రదించండి. ధైర్యంగా ఉండండి'అంటూ ఆ డాక్టర్ ఇచ్చిన భరోసాతో ఆ రోగిలో మనోధైర్యం పెరిగింది.

ఇదే ఫ్యామిలీ డాక్టర్ విధానం. ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువచేయడంతో పాటు మెరుగైన ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించగా.. ఈ నెల 6 నుంచి పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమం అమలుకు రంగం సిద్ధమైంది.

వైద్యులు, సిబ్బందికి శిక్షణ

అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే ఉన్న కుటుంబ వైద్యుల విధానాన్ని ఇక్కడ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా గత అక్టోబర్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఈ నెల 6 నుంచి ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలు కానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని భీమిలి మండలం ఆర్.తాళ్లవలస, ఆనందపురం మండలం ఆనందపురం, పద్మనాభం మండలం రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) పరిధిలో ఈ కార్యక్రమం పూర్తిస్థాయి అమలుకు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఏర్పాట్లు చేశారు. డీఎంహెచ్‌వోతో పాటు నోడల్ అధికారి డాక్టర్ సుశీల ఇప్పటికే ఆయా పీహెచ్‌సీల పరిధిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు కొనసాగించారు. వైద్య సిబ్బందిని సంసిద్ధులను చేశారు.



అందే వైద్య సేవలివే...

- జనరల్ అవుట్ పేషెంట్ సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటినేటర్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటర్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు, చిన్న పిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు
- రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు
- ఆరోగ్య శ్రీ కింద శస్త్రచికిత్స జరిగిన రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితం అయిన వారికి, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం
- పాలియేటివ్ కేర్
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ

సచివాలయాల పరిధిలో...

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 సిబ్బందితో కలిసి వైద్యులు ప్రతి నెలా రెండు రోజుల పాటు మూడు పీహెచ్‌సీల పరిధిలో 54 సచివాలయాల్లో సేవలందిస్తారు. ప్రతి ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్యులు ఉంటారు. వారిలో ఒకరు 104 వాహనంలో గ్రామంలో పర్యటిస్తారు. మరో వైద్యుడు పీహెచ్‌సీలో ఉంటారు. ఒక్కొక్క హెల్త్ అసిస్టెంట్‌కు రెండు నుంచి మూడు సచివాయాలకు చొప్పన మ్యాపింగ్ తయారు చేశారు. ఇప్పటికే 104 సిబ్బంది తన పరిధిలో ఉండే గ్రామానికి నెలకు ఒక సారి వెళుతున్నారు. ఈ సారి గ్రామం అనకుండా సచివాలయాన్ని ప్రాతిపదికగా తీసుకుని నెలలో రెండు సార్లు వైద్య బృందం వెళుతుంది. 104 వాహనం, వైద్య బృందం ఏ సచివాయాలనికి రానుందో.. ముందు రోజు ఆ గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు గుర్తించాల్సి ఉంటుంది. అలా గుర్తించిన రోగులకు ఉదయం ఓపీ నిర్వహిస్తారు. వృద్ధులు, వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులు, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేసిన వారికి మధ్యాహ్నం నుంచి వైద్య సేవలందిస్తారు. 104 వాహనం ద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందిస్తారు.

ఇవీ 14 రకాల పరీక్షలు

గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్, హిమోగ్లోబిన్ టెస్ట్, ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్) , మలేరియా టెస్ట్, హెచ్ఐవీ నిర్ధారణ, డెంగ్యూ టెస్ట్, మల్టీ పారా యూరిన్ స్ట్రిప్స్(డిప్ స్టిక్), అయోడిన్ టెస్ట్, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి నిర్ధారణ, ఫైలేరియాసిస్ టెస్ట్, సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్, విజువల్ ఇన్‌స్పెక్షన్, స్పుటమ్(ఏఎఫ్‌బి)

ఏర్పాట్లు పూర్తి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ట్రయల్ రన్ విజయవంతంగా చేపట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6 నుంచి మూడు పీహెచ్‌సీల పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. రోగులకు పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడే మందులు అందిస్తాం.

–డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

మెరుగైన సేవ.. ఆదాయం ఆర్జన

- ప్రగతి పథకంలో వాల్తేరు డివిజన్
- 2022–23లో 9294.6 కోట్ల ఆదాయం
- వివరాలు వెల్లడించిన డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ 2022-23 ఆర్థిక సంవత్సరంలోనూ రికార్డు సృష్టించింది. తన రికార్డులను తానే తిరగరాసి.. భారతీయ రైల్వేలోని ఇతర డివిజన్ల కంటే అత్యుత్తమ పనితీరు కనబరిచింది. రాయల్ ప్యాలస్ ఫంక్షన్ హాలులో మంగళవారం జరిగిన సమావేశంలో డివిజినల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి వాల్తేర్ డివిజన్ సాధించిన ప్రగతిని మీడియాకు వివరించారు. లోడింగ్, ప్రయాణికుల రవాణా, రెవెన్యూ, విద్యుత్ ఆదా, భద్రత, కేటరింగ్, టికెట్ తనిఖీలు, నాన్ ఫేర్ రెవెన్యూ ఇలా అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఇందులో భాగస్వాములైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ, సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ సాధించిన ప్రగతి

- 2021-22లో 19, 2022-23లో 22 లెవెల్ క్రాసింగ్‌లను మూసివేశారు.
- 2021-22లో 25, 2022-23లో 29 సబ్‌వేలను నిర్మించారు.
- 2021-22లో 6 జతల రైళ్లు, 2022-23లో 15 జతల రైళ్లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లుగా మార్చారు.
- సుమారు 400 స్పెషల్ రైళ్లు నడిపారు. బీఎస్‌ఎఫ్, ఆర్ఆర్‌బీ, ఎలక్షన్ స్పెషల్ రైళ్ల పేరిట మరో 13 రైళ్లు నడిచాయి.
- చీపురుపల్లి, విజయనగరం, పొందూరు, శ్రీకాకుళం రోడ్, కోటబొమ్మాళి, నౌపడ, రాయగడ స్టేషన్లలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు నిర్మించారు. నౌపడ, శ్రీకాకుళంరోడ్‌లో దేశంలోనే మొదటి, రెండవ స్టెయిన్‌లెస్ స్టీల్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించిన ఘనత ఈ డివిజన్‌కే దక్కుతుంది. పలు స్టేషన్లలో లిఫ్టులను నిర్మించారు.
- సింగపూర్‌రోడ్, లడ్డా, రాయగడ, దంతేవాడ, జగదల్‌పూర్ స్టేషన్లలో ప్లాట్‌ఫాంల ఎత్తు, పొడవు పెంచారు.
- విశాఖపట్నం రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద రూ.436 కోట్లతో జరిగే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కార్యాలయం ఇటీవలే ప్రారంభమైంది.
- వివిధ విభాగాల్లో కనబర్చిన ప్రతిభకు గానూ వాల్తేర్ డివిజన్ 14 మెరిట్ షీల్డ్‌ను సాధించింది.
- విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు ఈట్‌రైట్ స్టేషన్ సర్టిఫికెట్ దక్కింది. రాష్ట్రంలో ఈ సర్టిఫికెట్ సాధించిన ఏకైక స్టేషన్ ఇదే..
- క్వాలిటీ మేనేజ్‌మెంట్‌కు గానూ న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌కు 3 ఐఎస్‌వో సర్టిఫికెట్స్ వచ్చాయి.
- ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్‌చే ప్లాటినం రేటింగ్‌తో 'గ్రీన్ రైల్వే స్టేషన్ సర్టిఫికెట్' సాధించింది.
- కోచింగ్ డిపోలో మూడు మహిళా బృందాలతో నిర్వహణ పనులు చేపడుతున్నారు.

డివిజన్‌కు ఆదాయం ఇలా.. (కోట్లలో)

విభాగం	2021-22	2022-23	పెరుగుదల శాతం
సరకు రవాణా	7,350	8,389.48	2.73
ప్రయాణికుల రవాణా	420.89	714.81	69.83
టికెట్ తనిఖీలు	16.03	29.45	83.76
కేటరింగ్	3.67	7.06	92.82
నాన్‌ఫేర్ రెవెన్యూ	3.21	5.53	72.3
కోచింగ్	546.69	836.79	53.06
వివిధ ఆదాయ మార్గాలు	8.04	18.80	132.08



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్

ట్రాక్‌ల నిర్మాణం, ఆధునికీకరణ

వాల్తేర్ డివిజన్ పరిధిలో ట్రాక్‌ల నిర్వహణ అద్భుతంగా ఉందని, దీని కారణంగా రైళ్లు పట్టాలు తప్పడం తగ్గిందని డీఆర్‌ఎం వివరించారు. పలు మార్గాల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాక్ పనులు చురుగ్గా సాగుతున్నట్లు చెప్పారు. కేకే, కేఆర్ లైన్‌లో డబ్లింగ్ పనుల నిమిత్తం గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 17 కి.మీ ట్రాక్ నిర్మాణం జరగ్గా.. 2022-23లో 75.2 కి.మీలకు చేరిందని తెలిపారు.

రికార్డుల పరంపర

వాల్తేర్ డివిజన్ ఆదాయార్జన, లోడింగ్‌లో గత రికార్డులను తిరగరాసింది. ప్రయాణికుల ద్వారా 2021-22లో 420.89, 2022-23లో 69.83 వృద్ధి రేటుతో 714.81 కోట్లను ఆర్జించింది. ప్రయాణికుల రవాణాలో 2021-22లో 12.65 మిలియన్ ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేసింది. 2022-23లో లక్ష్యం 24.90 మిలియన్లు కాగా.. దీనిని అధిగమించి 27.86 మిలియన్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసి రికార్డు సృష్టించింది. వాల్తేర్ డివిజన్ వివిధ రకాల ఆదాయ మార్గాల ద్వారా 2021-22లో కేవలం 8.04 కోట్లు ఆర్జించగా, 2022-23లో ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జోన్ పరిధిలోనే అత్యధికంగా 132.08 శాతం అంటే 18.80 కోట్లు సాధించింది. 2022-23లో 25.53 మిలియన్ టన్నుల బొగ్గును లోడింగ్ చేయడం ద్వారా గతంలో కంటే 5.80 శాతం అధికంగా నమోదు చేసింది. మొత్తంగా గత ఆర్థిక సంవత్సరం కంటే 9.36 శాతం పెరుగుదల నమోదు చేసి 9294.6 కోట్లు ఆర్జించింది.

ఆశలు చిగురిస్తున్నాయి

- పునరుజ్జీవనం పొందిన వృక్షాలు
- కంటికి రెప్పలా కాపాడుతున్న ఏయూ సిబ్బంది

ఏయూక్యాంపస్ : ఆశలు చిగురిస్తున్నాయి. అధికారుల ప్రయత్నాలు సఫలీకృతమవుతున్నాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భారీ వృక్షాల సంరక్షణకు అధికారులు చూపిన చొరవ సత్ఫలితాలనిస్తోంది. గతంలో ఏయూ మైదానంలో తొలగించిన వృక్షాలను కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వెనుక భాగంలో న్యూ క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ ఎదురుగా నాటారు. ప్రతీ చెట్టును సంరక్షించాలనే సదుద్దేశంతో చేపట్టిన ఈ ప్రయత్నం, అధికారుల చిత్తశుద్ధి తోడవడంతో నేడు ఇవి పచ్చగా చిగురిస్తూ ఎంతో ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి.

భారీ వృక్షాలకు పునరుజ్జీవనం

అసాంఘిక శక్తులకు నిలయంగా మారి కలుపుమొక్కలు, వ్యర్థాలతో నిండిన ఏయూ మైదానాన్ని అధికారులు దాతల సహకారంతో శుభ్రంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ కోసం భారీ వేదిక అవసరమవడంతో జిల్లా యంత్రాంగం ఏయూ మైదానాన్ని వేదికగా ఎంచుకుంది. ఈ ప్రక్రియలో పలు ప్రాంతాల్లోని వృక్షాలను తొలగించాల్సిన అవసరం ఏర్పడింది. వెంటనే ఏయూ వృక్ష శాస్త్ర విభాగం ఆచార్యులు, జీవీఎంసీ ఉద్యానవన విభాగం అధికారులు ఆలోచన చేసి ఈ వృక్షాలను వేరొక చోట నాటాలని నిర్ణయించారు. తొలగించిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన న్యూ క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ వద్ద నాటారు. వీటికోసం ప్రత్యేకంగా గుంతలు తవ్వి, వాటిలో సేంద్రియ ఎరువులు, పశువుల పేడ వేసి వృక్షాలు త్వరగా పునరుజ్జీవనం అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వీటికి అవసరమైన నీటిని సరఫరా చేస్తూ సంరక్షించారు. ప్రస్తుతం ఇక్కడ నాటిన మర్రి, రావి, కానుగ, బాదం వంటి వృక్షాలు పూర్తిగా చిగురిస్తున్నాయి.



చెట్లకు పెరిగిన ఆకులు

మొక్కలు నాటి సంరక్షించడం

ఇటీవల మైదానం చుట్టూ వివిధ ఔషధ మొక్కలను చినజీయర్ స్వామి సమక్షంలో విద్యార్థులతో నాటించారు. వీటి సంరక్షణ బాధ్యతలను పక్కనే ఉన్న హాస్టల్ సిబ్బందికి అప్పగించారు. వీటికి రక్షణగా ట్రీ గార్డులను సైతం ఏర్పాటు చేశారు. త్వరలో విద్యార్థులు పూర్తి స్థాయిలో భాగస్వాములను చేస్తూ భారీ స్థాయిలో వృక్షాలను నాటే కార్యక్రమాన్ని ఏయూ చేపడుతోంది. వర్షాలు కురిసే నాటికి వర్సిటీలో పలు ప్రాంతాలను గుర్తించి అక్కడ వేల సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. వర్సిటీ భవిష్యత్ విస్తరణ దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అనువైన స్థలాలో వృక్షాలను పెంచే విధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



చిగుళ్లతో కళకళలాడుతున్న వృక్షాలు

వృక్షాల సంరక్షణ బాగుంది

వర్సిటీలో వృక్షాల సంరక్షణకు అధికారులు చూపుతున్న చొరవ అభినందనీయం. ప్రత్యేక శ్రద్ధ వహించి భారీ వృక్షాలను పునరుజ్జీవనం చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. వీటిలో అధికశాతం చెట్లు పచ్చని ఆకులతోదర్శనమిస్తున్నాయి. మరికొన్ని వృక్షాలు చిగురించాయి.

–ఆచార్య ఎం.రాంజీ, ఫ్యాకల్టీ, ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి, హాజరైన సభ్యులు

- గృహనిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- అధికారులు ప్రొటోకాల్ పాటించాలి
- గైర్హాజరు అధికారులపై చర్యలు
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయాలని, వాటి ఫలితాలు అర్హులందరికీ అందేలా చూడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై జెడ్పీటీసీలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. పెళ్లి కానుకపై గ్రామ సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న కొందరికి సామాజిక పింఛన్లు మంజూరు కావడం లేదని ఒక సభ్యుడు సభ దృష్టికి తెచ్చారు. దీనిపై అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ సమాధానమిస్తూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు తలెత్తడం వల్ల ఆలస్యమవుతోందని, ఈ విషయాన్ని విజయవాడ అధికారులకు తెలియజేశామని చెప్పారు. ఇంట్లోనే టైలరింగ్ వృత్తి చేసుకునే టైలర్లకు కూడా జగనన్న చేదోడు కింద రూ.10 వేలు చెల్లించేందుకు అనుమతి లభించిందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.ప్రసాద్ చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు జరిగేలా, అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఆసరా వంటి పథకాల చెల్లింపులకు ముందు లబ్ధిదార్లతో సమావేశం నిర్వహించాలని గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు కోరారు. ఇకపై లబ్ధిదార్లతో ముందస్తు సమావేశాలు నిర్వహించేలా చూడాలని అధికారులను చైర్‌పర్సన్ కోరారు. వేములపూడి హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు లేక 250 మంది విద్యార్థులు వెనక్కి వెళ్లిపోయారని నర్సీపట్నం జెడ్పీటీసీ ఎస్.రమణమ్మ తెలిపారు. అక్కడ అదనపు గదుల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు చైర్‌పర్సన్ సూచించారు. పాఠశాలల్లో నాడు–నేడు పనులు జూన్‌లోగా పూర్తి చేస్తామని డీఈవో చంద్రకళ తెలిపారు.

కేజీహెచ్‌లో మెరుగైన సేవలు

విశాఖ కేజీహెచ్‌లో గతంకంటే వైద్య సేవలు మెరుగయ్యాయని జెడ్పీ చైర్‌పర్సన్ సహా పలువురు సభ్యులు కితాబునిచ్చారు. ప్రస్తుత సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. చిన్న పిల్లల ఆరోగ్యం బాగా క్షీణించాక కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారని, దీంతో వీరిలో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని అశోక్‌కుమార్ చెప్పారు. అందువల్ల అనారోగ్యంతో ఉన్న పిల్లలను సకాలంలోనే కేజీహెచ్‌కు తీసుకురావాలని కోరారు. గత మూడు నెలల్లో కేజీహెచ్‌లో 214 మంది పిల్లలను తీవ్ర అనారోగ్యంతో చేర్చారని, వీరిలో 164 మందికి నయం చేసి పంపామని, 12 మంది పిల్లలు మరణించారని వివరించారు. ఇటీవల విశాఖ ఏజెన్సీలోని గన్నెల పంచాయతీలో ఏడుగురు మరణాలకు వేర్వేరు కారణాలని విచారణలో తేలిందని హుకుంపేట జెడ్పీటీసీ మత్స్యలింగం అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏజెన్సీలో మూఢ నమ్మకాలు తగ్గించాలని, చిన్న పిల్లల వైద్యుల సంఖ్యను పెంచాల్సి ఉందని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు చెప్పారు. గత ప్రభుత్వాలన్నిటికంటే ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు.

ప్రొటోకాల్ పాటించాల్సిందే..

మండలాల అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలాల్లో అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసే శిలాఫలకాలపై జెడ్పీటీసీల పేర్లు విధిగా ఉండేలా చూడాలని, స్థాయీ సంఘాల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర సీఈవోను ఆదేశించారు. పరవాడ మండలంలో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుకుపోతున్నారని, దానికి అడ్డుకట్ట వేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాధారణ పద్దు కింద బిల్లులు చెల్లించండి

మేయర్‌కు కాంట్రాక్టర్ల విజ్ఞప్తి



మేయర్, డిప్యూటీ మేయర్లకు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్

డాబాగార్డెన్స్: తమ సమస్యలు పరిష్కరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్‌లకు జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, కన్వీనర్ గొంప చంద్రమౌళి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల సీఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేసిన బిల్లులను తిరిగి జీవీఎంసీకి వెనక్కి పంపారని, ఈ బిల్లులు కౌన్సిల్‌లో తీర్మానం చేసి జీవీఎంసీ సాధారణ పద్దు నుంచి ఇప్పించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా చేసిన పనులు సీఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేసినా.. ఈ రోజు వరకు చెల్లింపులు జరగలేదన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి జీవీఎంసీలో చేసిన పనులకు వెంటనే బిల్లుల చెల్లింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసినా.. ఇప్పటి వరకు జీవీఎంసీ సాధారణ పద్దు నుంచి బిల్లుల చెల్లింపులు జరగలేదన్నారు. వెంటనే కమిషనర్‌తో చర్చించి బిల్లులు ఇప్పించాలని కోరారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కొత్త యాక్సిస్ కంట్రోల్ సిస్టమ్ పెట్టడం వల్ల అధికారులతో మాట్లాడానికి లోపలకు వెళ్లడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. అసోసియేషన్‌కు 5 యాక్సిస్ ఓపెన్ కార్డులు ఇప్పించాలన్నారు. పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కాపులపై అనిత కక్ష సాధింపు

- గతంలో కార్యకర్తపై చెప్పుతో దాడి
- పాయకరావుపేటలో బహిష్కృతులైన టీడీపీ నేతల ఆగ్రహం
- పార్టీకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరిక

నక్కపల్లి/పాయకరావుపేట: నియోజకవర్గంలో కాపులపై మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొర్లె రాజబాబు, పాయకరావుపేట పట్టణశాఖ మాజీ అధ్యక్షుడు తుని, పాయకరావుపేట పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈ ఇద్దరు నాయకులను సస్పెండ్ చేస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారు పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం వారిని అనిత చులకనగా చూస్తోందన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నడిరోడ్డుపై చెప్పుతో కొట్టిందన్నారు. టీడీపీలో కాపు నాయకుడిగా ఉన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవలటీడీపీ నాయకుడు కల్లేపల్లి బాబ్జిరాజు ఇంటికి వస్తే తాము వెళ్లి కలిశామన్నారు. దీనిపై కక్ష కట్టిన అనిత తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయించిందన్నారు. అనిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆమె చేస్తున్న అవినీతి అక్రమాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో ఆమెకు పాయకరావుపేట టికెట్ ఇవ్వలేదన్నారు. అప్పటి నుంచి అనిత తమపై కక్ష కట్టిందన్నారు. పార్టీ నిర్ణయం మార్చుకోకపోతే రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్

- మూడు చోట్ల దొంగతనాలు
- మహిళల మెడలో బంగారు ఆభరణాలు లాక్కొని పరారీ

అల్లిపురం/ సీతమ్మధార/ మద్దిపాలెం: నగరంలో మంగళవారం ఉదయం చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. నడిచి వెళ్తున్న మహిళలనే టార్గెట్ చేసి మూడు చోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు. ఉదయం 6.20 గంటల సమయంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులోని శ్రీనివాసనగర్ ప్రధాన ద్వారం రోడ్డులో రత్నావతి అనే 60 ఏళ్ల వృద్ధురాలు వాకింగ్ చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు హెల్మెట్, మాస్కులు ధరించి అటువైపుగా వచ్చారు. ఈ క్రమంలో ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలతాడుతో పాటు నల్లపూసలను లాక్కొన్నారు. నల్ల పూసలు రోడ్డు మీద పడిపోవడంతో పుస్తెలతాడు పట్టుకొని పారిపోయారు. సమాచారం అందుకున్న ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. అటుగా వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

టూటౌన్ పరిధిలో..

ఉదయం 6.30 గంటలకు రైల్వే క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన తాడి రమణమ్మ అనే 56 మహిళ సౌత్‌జైలురోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద నుంచి డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ వైపు నడిచి వస్తోంది. వెనుకనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని తులంన్నర బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు. దీంతో ఆమె గట్టిగా అరిచింది. స్థానికులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సమీపంలోని సీసీ పుటేజ్‌లను పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఐదో పట్టణ స్టేషన్ పరిధిలో..

జ్ఞానాపురంలో నివాసం ఉంటున్న ఓ మహిళ స్కూల్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగా స్కూల్‌కు వెళ్తున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆమె మెడలో మూడు తులాల బంగారు నగలను అపహరించారు. విషయం తెలుసుకున్న క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మహిళ ఫిర్యాదు మేరకు కంచరపాలెం క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఈ ఘటన సీసీ పుటేజీల్లో నమోదు కావడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. స్నాచర్లు వరస దొంగతనాలకు పాల్పడటంతో కంచరపాలెం మెట్టు వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీసీపీ ఆదేశాలతో కంచరపాలెం క్రైం సీఐ దుర్గా ప్రసాద్ నేతృత్వంలో ఎస్‌ఐలు, వెస్ట్ సబ్ డివిజన్ క్రైం పోలీసులు తనిఖీలు చేపట్టారు.

త్రీటౌన్‌లో బైక్ చోరీపై ఫిర్యాదు

ఆ ఇద్దరు యువకులు త్రీటౌన్ పరిధిలో ద్విచక్రవాహనం దొంగలించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేలింది. దీనిపై మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు నమోదైంది. ఆ ఇద్దరి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



సీతంపేట రెల్లివీధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ శ్రావణి

సీతంపేట: జిల్లాలో పింఛన్ల పంపిణీ మంగళవారం చురుగ్గా సాగింది. పింఛనుదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. నిండు గర్భిణీ అయిన 25వ వార్డుకు చెందిన వలంటీర్ రాగోలు శ్రావణి సీతంపేట 133 సచివాలయం పరిధిలో అవ్వా తాతలకు పింఛను సొమ్ము అందజేసింది. నిండు గర్భిణీ అయినా అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న శ్రావణిని పలువురు అభినందించారు.

నేడు టీడీపీ ఉత్తరాంధ్ర జోన్ సమీక్ష సమావేశం

మహారాణిపేట: టీడీపీ ఉత్తరాంధ్ర జోన్ సమీక్ష సమావేశం బుధవారం మధురవాడ వి కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి పలు అంశాలపై చర్చ నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జిలు, ఆ పార్టీ నాయకులు పాల్గొనున్నారు.

నిందితుడికి రిమాండ్

సీతమ్మధార : బంగారు గొలుసు దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఈస్టు క్రైం సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. ఈ నెల 1వ తేదీన సాయంత్రం అక్కయ్యపాలెంలో ఉషాకిరణ్ అనే యువతి నడుచుకొని వస్తుండగా చైన్ స్నేచర్ పెద్దింటి బలరామకృష్ణ ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కొనిపోయాడు. దీంతో ఆమె ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ ఖగేశ్వరరావు తన సిబ్బందితో దొంగను పట్టుకొని బంగారు గొలుసు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు కొత్తరూపు

- నాడు–నేడుతో మారనున్న రూపురేఖలు
- జిల్లాలో 83 కేంద్రాలకు నిధులు
- ఆట వస్తువులకు రూ.2.5 లక్షల కేటాయింపు

ఐసీడీఎస్‌ప్రాజెక్టులు	3
అంగన్‌వాడీ కేంద్రాలు	776
గర్భిణులు, బాలింతలు	18,402
6 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు	51,966
3–6 సంవత్సరాలు పిల్లలు	13,664
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	221



సీతంపేట అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. నాడు–నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు పెంపుతో పాటు అవసరమైన చోట నూతన భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వివిధ పథకాల ద్వారా జిల్లాలోని 83 కేంద్రాలకు తొలుత నిధులు మంజూరయ్యాయి. ఇందులో 13 చోట్ల నాడు–నేడు కార్యక్రమంలో పనులు చేపట్టారు. జిల్లాలో సొంత భవనాలు ఉన్న 20 కేంద్రాలకు మరమ్మతుల కోసమని ఒక్కో దానికి రూ.5లక్షల చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలోని అన్ని అంగన్ కేంద్రాలకు దశల వారీగా నిధులు కేటాయించి.. పక్కా భవనాలు నిర్మించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

చిన్నారులకు సౌకర్యవంతంగా..

జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను సమీప ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి, ప్రీ ప్రైమరీ స్కూళ్ల పేరుతో 3 నుంచి 6 ఏళ్ల వయసు గల పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ ఇదే చోట నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు. నాడు–నేడులో నూతనంగా నిర్మించే చోట రూ2.50 లక్షలతో ఉయ్యాల, జారుడుబల్ల, ఇతర ఆట వస్తువులను సమకూర్చనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం బోధన అమలు చేస్తున్న నేపథ్యంలో దీనికి అంగన్‌వాడీల్లోనే పటిష్టమైన పునాదులు వేసేలా ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేస్తోంది.

టీడీపీ హయాంలో నిర్వీర్యం

మాతా–శిశు సంరక్షణలో కీలక భూమిక పోషించే కేంద్రాల నిర్వహణపై టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. కేంద్రాల్లో మౌలిక వసతులు పెంపొందించేందుకు ఏమాత్రం శ్రద్ధ చూపకపోగా..అర్బన్ ప్రాంతాల్లోని అద్దె భవనాలకు కూడా పై పై రంగులు వేసి.. అప్పటి టీడీపీ నాయకులు నిధులు కొల్లగొట్టారు. మాతా–శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల ఆవశ్యకతను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీటిని బలోపేతం చేసేలా దృష్టి సారించింది.

పనులపై ప్రత్యేక దృష్టి



నాడు–నేడులో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. దశల వారీగా అన్ని కేంద్రాలకు నిధులు మంజూరవుతాయి.

– అప్పల నాయుడు, ఏపీవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

సౌకర్యాలు మెరుగుపడతాయి



అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రతీ చోట కొత్త భవనాలు సమకూరనున్నాయి. కేంద్రాల్లో మౌలిక వసతుల పెంపొందించేలా నాడు–నేడు కార్యక్రమంలో నిధులు మంజూరు కావడం సంతోషం. పిల్లలకు సౌకర్యాలు మెరుగుపడతాయి. పిల్లలకు ఉపయోగకరంగా ఆట వస్తువులు కూడా పాఠశాలల హెచ్‌ఎం ఆధ్వర్యంలో కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం.

– డి.వెంకటేశ్వరి, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి, విశాఖ జిల్లా

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,330
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,300
వెండి(కిలో):	రూ.77,800

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	430.00
విజయనగరం	434.00
శ్రీకాకుళం	434.00